# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ: 28-04-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

- జమ్మూకాశ్మీర్ లోని పహల్గాంలో జరిగిన ఉగ్రవాదుల నేపథ్యంలో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఈరోజు ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో భేటీ అయ్యారు.
- భారతదేశం మత్స్య ఉత్పత్తిలో ప్రపంచ వ్యాప్తంగా 2వ స్థానంలో ఉందని కేంద్రమంత్రి రాజీవ్ రంజన్ సింగ్ అన్నారు.
- భారత అత్యున్నత పురస్కారాలైన 'పద్మ' అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం ఈరోజు ఘనంగా జరిగింది.
- అత్యాధునిక యుద్ధ విమానాలైన 26 రాఫెల్ మెరైన్ యుద్ధ విమానాల కొనుగోలు కోసం భారత్ ఫ్రాన్స్‌తో ఒప్పందంపై ఈరోజు సంతకాలు చేసింది.

==========================

జమ్మూకాశ్మీర్ లోని పహల్గాంలో జరిగిన ఉగ్రవాదుల దాడితో భారత్, పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. భద్రతా దళాలు ఉగ్రవాదుల కోసం ప్రతి అంగుళం శోధిస్తున్నాయి. ఈ క్రమంలోనే రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఈరోజు ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో భేటీ అయ్యారు. పహల్గాంలో పరిస్థితులతో పాటు భద్రతా సన్నద్ధతపై సైన్యం తీసుకున్న నిర్ణయాలను ఆయనకు వివరించారు. దాదాపు 40 నిమిషాల పాటు ఈ సమావేశం జరిగింది. పహల్గాం దాడి నేపథ్యంలో భారత్ తీసుకోవాల్సిన చర్యలపై చర్చించేందుకు చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ జనరల్ అనిల్ చౌహాన్‌తో నిన్న జరిగిన సమావేశ వివరాలను రక్షణమంత్రి ప్రధానమంత్రికి వివరించారు. ఈ భేటీలో జాతీయ భద్రతా సలహాదారు అజిత్ ధోవల్ కూడా పాల్గొన్నారు.

==========================

భారత గణతంత్ర దినోత్సవం వేళ కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన 'పద్మ' అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం ఈరోజు ఘనంగా జరిగింది. ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఈ అవార్డులను అందజేశారు. తెలుగు రాష్ట్రాల నుంచి వైద్య విభాగంలో పద్మ విభూషణ్ పురస్కారానికి ఎంపికైన డాక్టర్

దువ్వూరు నాగేశ్వర్ రెడ్డి, కళా రంగంలో పద్మభూషణ్‌కు ఎంపికైన సినీ నటుడు బాలకృష్ణ, పద్మశ్రీకి ఎంపికైన మాడుగుల నాగఫణిశర్మ రాష్ట్రపతి చేతుల మీదుగా ఈ విశిష్ఠ పౌర పురస్కారాలను అందుకున్నారు. అలాగే, సినీ నటుడు అజిత్, క్రికెటర్ రవిచంద్రన్ అశ్విన్ తదితరులు 'పద్మ' అవార్డులను అందుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, కేంద్రమంత్రులు కిషన్ రెడ్డి, కె.రామ్మోహన్ నాయుడు, శివరాజ్‌సింగ్ చౌహాన్, జితేంద్రసింగ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సంవత్సరానికి కేంద్రం ఏడుగురికి పద్మవిభూషణ్, 19 మందికి పద్మభూషణ్, 113 మందికి పద్మశ్రీ పురస్కారాలను ప్రకటించింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

భారతదేశం మత్స్య ఉత్పత్తిలో ప్రపంచ వ్యాప్తంగా 2వ స్థానంలో ఉందని కేంద్ర మత్స్య, పశుసంవర్థక, పాడిపరిశ్రమ శాఖ మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ అన్నారు. ముంబైలో **Coastal States Meet 2025** ను ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి మాట్లాడుతూ..., 2023-24లో 184.02 లక్షల టన్నుల మత్స్య ఉత్పత్తి జరిగిందని తెలిపారు. భారతదేశం తొమ్మిది తీరప్రాంత రాష్ట్రాలు, నాలుగు కేంద్రపాలిత ప్రాంతాలలో 11 వేల కిలోమీటర్ల కంటే ఎక్కువ తీరప్రాంతాన్ని కలిగి ఉందని తెలిపారు. ప్రస్తుతం భారత మత్స్య ఎగుమతులు 60 వేల 524 కోట్ల రూపాయలుగా ఉన్నాయని కేంద్రమంత్రి వివరిస్తూ...

(వాయిస్ 29 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశ వ్యాప్తంగా మే 4న జరిగే నీట్ (యూజీ) పరీక్షపై అసత్య ప్రచారానికి అడ్డుకట్ట వేసేందుకు NTA చర్యలు చేపట్టింది. ఈ మేరకు నీట్‌కు సంబంధించి అనుమానాస్పద, తప్పుదారి పట్టించే వార్తలు, ప్రచారాలను గుర్తించి వెంటనే ఫిర్యాదు చేసేలా NTA అధికారులు ఓ కొత్త ప్లాట్ ఫాంను రూపొందించారు. నీట్ పరీక్షకు సంభందించి అనుమానాస్పద కార్యకలాపాల్ని neetclaim.centralindia.cloudapp.azure.com పోర్టల్ ద్వారా నివేదించవచ్చని సూచించింది. ఈ ఫారమ్ చాలా సరళంగా ఉంటుందని, యూజర్లు తామేం గమనించారో, ఎక్కడ, ఎప్పుడు జరిగిందో తెలిపేందుకు వీలుగా సంబంధిత ఫైల్‌ను సైతం అప్‌లోడ్ చేసే వీలుందని వెల్లడించింది. పబ్లిక్ ఎగ్జామినేషన్స్ (అక్రమ పద్ధతుల నివారణ) చట్టం 2024కి అనుగుణంగా ఈ చర్యలు చేపట్టినట్లు ఎన్‌టీఏ తెలిపింది. పబ్లిక్ పరీక్షల్లో అక్రమ పద్ధతులను నివారించడం, అభ్యర్థుల భవిష్యత్‌ను రక్షించడమే లక్ష్యమని పేర్కొంది. ఈ చట్టం కింద జరిగే నేరాలకు కఠినమైన నిబంధనలు ఉన్నాయని పేర్కొంది. అనుమానాస్పద క్లెయిమ్‌లపై రిపోర్టు చేసేందుకు ఈ పోర్టల్ మే 4న సాయంత్రం 5 గంటల వరకు అందుబాటులో ఉంటుందని ఎన్టీఏ పేర్కొంది. ఈ పరీక్షకు సంబంధించి విద్యార్థులను, తల్లిదండ్రులను తప్పుదారి పట్టించే ప్రచారం పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎన్‌టీఏ సూచించింది.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

అత్యాధునిక యుద్ధ విమానాలైన 26 రాఫెల్ మెరైన్ యుద్ధ విమానాల కొనుగోలు కోసం భారత్ ఈరోజు ఫ్రాన్స్‌తో ఒప్పందం కుదుర్చుకొంది. ఈ మేరకు న్యూఢిల్లీలో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, ఫ్రాన్స్ సాయుధ దళాల మంత్రి సెబాస్టియన్ లెకోర్ను ప్రభుత్వ ఒప్పందంపై సంతకాలు చేశారు. ఈ యుద్ధ విమానాలలో 22 సింగిల్-సీటర్, నాలుగు డబుల్-సీటర్ విమానాలు ఉన్నాయి. వీటిని భారత నావికాదళం అవసరాలకు అనుగుణంగా రూపొందించి తయారు చేస్తారు. రాఫెల్ మెరైన్ విమానాల చేరికతో, భారత నావికాదళం మరింత బలోపేతం కానుంది. రాఫెల్ లో అధునాతన ఆయుధ వ్యవస్థలు, క్షిపణులు అమర్చబడతాయి. ఈ యుద్ధ విమానాలను INS విక్రమాదిత్య, INS విక్రాంత్ వంటి వాహక నౌకలలో మోహరిస్తారు. ఈ విమానాల 2030 నాటికి భారత్ కు చేరనున్నాయి.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

పాకిస్తాన్‌కు చెందిన 16 యూట్యూబ్ ఛానెల్‌లను భారతదేశం నిషేధించింది. ఇటీవలి పహల్గామ్ ఉగ్రవాద దాడి నేపథ్యంలో భారతదేశంపై తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేసినందుకు డాన్ న్యూస్, సమా టీవీ, ఆరీ న్యూస్, జియో న్యూస్ సహా పలు పాకిస్తానీ యూట్యూబ్ ఛానెల్‌లను నిషేధించింది. భారతదేశం, దేశ సైన్యం, భద్రతా సంస్థలకు వ్యతిరేకంగా, అలాగే మతపరంగా తప్పుదారి పట్టించే కథనాలను వ్యాప్తి చేసినందుకు ఈ ఛానెల్‌లను నిషేధించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశంలోని ప్రతి యువతకు విద్యను అందించడమే కాకుండా, విద్యా వనరుతో అనుసంధానించడమే ప్రధానమంత్రి నరేంద్ర మోడీ లక్ష్యమని కేంద్ర కమ్యూనికేషన్ల శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా అన్నారు. ఈరోజు ఢిల్లీలో జ్ఞాన్ పోస్ట్ పేరుతో భారత తపాలా శాఖ ఒక నూతన పథకాన్ని ప్రారంభించింది. ఈ కార్యక్రమ్మలో పాల్గొన్న కేంద్రమంత్రి మాట్లాడుతూ... ఈ జ్ఞాన్ పోస్ట్ సేవ ఆధారంగా, విద్యా పుస్తకాలు ప్రజలకు సరసమైన రీతిలో చేరాలనేది ప్రభుత్వ సంకల్పమని అన్నారు.

(వాయిస్ 34 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఉక్రెయిన్‌లో రష్యా తాత్కాలిక కాల్పుల విరమణను ప్రకటించింది. విక్టరీ డే నేపథ్యంలో వచ్చే నెల 8 నుంచి 10వ తేదీవరకు పూర్తిస్థాయి కాల్పుల విరమణ పాటిస్తామని క్రెమ్లిన్ వెల్లడించింది. మానవతా దృక్పథంతో దేశాధ్యక్షుడు పుతిన్ ఈమేరకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపింది. ఉక్రెయిన్ సైతం కాల్పుల విరమణకు కట్టుబడి ఉంటుందని తామ నమ్ముతున్నామని, అందుకు భిన్నంగా వ్యవహరిస్తే మాత్రం తమ ఆర్మీ ధీటుగా బదులిస్తుందని ఆ ప్రకటనలో స్పష్టం చేసింది. కాగా రెండో ప్రపంచ యుద్ధంలో నాజీ జర్మనీపై విజయానికి గుర్తుగా రష్యా ప్రభుత్వం ఏటా మే 9న విక్టరీ డే వేడుకలు నిర్వహిస్తుంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

అమెరికా నుంచి ఇటీవల భారత్ కు తీసుకొచ్చిన ముంబై ఉగ్రదాడి కేసు నిందితుడు తహవ్వుర్ రాణాను భారీ భద్రత మధ్య పాటియాలా హౌస్ కోర్టు ముందు ఈరోజు హాజరుపరిచారు. తహవ్వుర్ రాణాకు కోర్టు ఆదేశించిన 18 రోజుల ఎన్ఐఏ (NIA) కస్టడీ ఈరోజు ముగియనుండటంతో కోర్టు ముందు ఆయనను హాజరుపరిచారు. మరో 12 రోజులు ఆయనను కస్టడీకి ఇవ్వాలని ఈ సందర్భంగా కోర్టును ఎన్ఐఏ కోరింది. రాణాను న్యాయమూర్తి చందర్ జిత్ సింగ్ ముందు హాజరుపరిచినట్టు ఎన్ఐఏ వర్గాలు తెలిపాయి. సీనియర్ న్యాయవాది దయాన్ కృష్ణన్ నేతృత్వంలోని దర్యాప్తు బృందం కూడా కోర్టుకు హాజరైంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = = = = =